కృష్ణకాలనీ : ఎన్నికల అధికారులకు సూచనలిస్తున్న స్వాగత్ రణ్వీర్ చంద్

గుర్తులు స్పష్టంగా కనిపించాలి

పోలింగ్‌ను అప్‌లోడ్ చేయాలి ■ సాధారణ పరిశీలకురాలు స్వాగత్ రణ్వీర్ చంద్

కృష్ణకాలనీ/భూపాలపల్లి రూరల్, మే 6 : బ్యాలెట్ యూనిట్లలో ఓటర్లకు గుర్తులు స్పష్టంగా కనిపించేలా చూడాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకురాలు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ సూచించారు. అలాగే పోలింగ్ ప్రక్రియను ప్రతిరోజూ ఎన్నికల పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సోమవారం సింగరేణి మినీ ఫంక్షన్ హాల్లో కొనసాగుతున్న ఈవీఎం, వీ వీ ప్యాట్ల కమిషనింగ్ ప్రక్రియతో పాటు భూపాలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 42 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నట్లు తెలిపారు. మొత్తం ఎన్నికల ప్రక్రియకు 1,236 బ్యాలెట్ యూనిట్లు, 412 కంట్రోల్ యూనిట్లు, 412 వీవీ ప్యాట్ల కమిషనింగ్ చేపట్టినట్లు తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ముగిసిన అనంతరం స్ట్రాంగ్ రూములో పటిష్ట భద్రత, వీడియోగ్రఫీ మధ్య భద్రపరచాలన్నారు. వారి వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి నారాయణరావు, ఆర్డీవో, సహాయ రిటర్నింగ్ అధికారి మంగీలాల్ తదితరులున్నారు.

ఎండ తీవ్రత నుంచి రక్షణ కల్పించాలి

ములుగు రూరల్, మే 6 : ఎన్నికల సిబ్బందికి ఎండ తీవ్రత నుంచి రక్షణ కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ ఏళ్ల మధుసూధన్, తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజునాయక్ వేర్వేరు ప్రకటనల్లో ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, సిబ్బందిని పోలింగ్ స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ఎక్కువ సంఖ్యలో వాహనాలను అందుబాటులో ఉంచాలని కోరారు. రిసెప్షన్ సెంటర్‌లో అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని, తప్పనిసరిగా కూలర్లు, చల్లని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. విధులు ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యే సమయంలో రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు

మహదేవపూర్, మే 6 : మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన పోలీసు సిబ్బందితో కలిసి మండలంలోని రాపల్లికోటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధా న కూడలిలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిషేధిత మత్తు పదార్థాలైన గంజాయి, గుట్కా, గుడుంబా విక్రయించొద్దని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

మహదేవపూర్, మే 6 : మండలంలోని అంబట్‌పల్లి ఇసుక క్వారీ పనులను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. అంబట్‌పల్లి గోదావరి తీరంలో ఇసుక క్వారీ పనులు ఇటీవల ప్రారంభం అయ్యాయి. ఒక్కో క్వారీలో లక్షా యాభై వేల మెట్రిక్ టన్నుల ఇసుక తీసేందుకు కాంట్రాక్టర్లు అనుమతులు పొందారు. కాగా ఈ క్వారీలో మనుషుల ద్వారా తవ్వకాలు జరిగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా యంత్రాలతో చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తూ పనులను అడ్డుకున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో క్వారీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజల పొట్టకొడుతున్నారని, ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఇసుక క్వారీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐపీఎల్ బెట్టింగ్ దారుల బైండోవర్

టేకుమట్ల, మే 6 : ఐపీఎల్ క్రికెట్‌లో బెట్టింగులకు పాల్పడిన వారిని సోమవారం తహసీల్దార్ విజయలక్ష్మి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ వెల్లడించారు. మండలంలోని వెలిశాలకు చెందిన దామరవేని నారాయణరావు, పంగిడిపల్లి గ్రామానికి చెందిన గంధం సుమన్, సరోత్తం, చిలువేరు కుమార్, పెద్దంపల్లికి చెందిన పీ రమేశ్, ఆశిరెడ్డిపల్లికి చెందిన బండారు శివపై కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హోంగార్డుకు సన్మానం

ములుగు రూరల్, మే 6 : ములుగు జిల్లా కేంద్రంలో హోంగార్డుగా విధులు నిర్వర్తించి సోమవారం ఉద్యోగ విరమణ పొందిన పోమానాయక్ దంపతులను ఎస్పీ శబరీష్ తన కార్యాలయంలో సన్మానించారు. జ్ఞాపికను అందించి ఆయన సేవలను కొనియాడారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ సదానందం, ఆర్ఐ వెంకట నారాయణ తదితరులున్నారు.

జ్వర సర్వే

కన్నాయిగూడెం, మే 6 : మండలంలోని గుట్టల గంగారం గ్రామంలో హెల్త్‌అసిస్టెంట్ లక్ష్మణ్, భాస్కర్ ఆధ్వర్యంలో సోమవారం జ్వర సర్వే నిర్వహించారు. పలువురి రక్త నమూనాలను సేకరించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు.

కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారు..

- ఒట్లు, తిట్లతోనే కాలం వెళ్ల దీస్తున్న సీఎం
- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర
- బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం

ప్రచారంలో భాగంగా ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ/భూపాలపల్లి రూరల్, మే 6 : దొంగ హమీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఒట్లు, తిట్ల పురాణంతోనే సీఎం రేవంత్ రెడ్డి కాలం వెళ్లదీస్తున్నాడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ గెలుపు కోరుతూ పట్టణంలోని కారల్ మార్క్స్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీలతో పాటు భూపాలపల్లి మండలంలోని రాంపూర్, కమలాపూర్, ఆముదాలపల్లి గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు గండ్ర ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతర ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. ప్రజలకిచ్చిన హామీలను పక్కన పెట్టి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ, రాజకీయ వ్యవస్థకు మచ్చ తెచ్చే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ కులమతాల మధ్య చిచ్చుపెట్టి, రాముని పేరుతో ఓట్లు అడుగుతున్నారన్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ ప్రజల చిరకాల కాంక్షను కేసీఆర్ నెరవేర్చారని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి 420 హామీలు అమలు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ప్రజల హక్కులను కాపాడే బీఆర్ఎస్‌కు ఓటువేసి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని గండ్ర కోరారు. ప్రచారంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, కౌన్సిలర్లు మేకల రజితా మల్లేశ్, నూనె రాజు, జక్కం రవి కుమార్, ముంజంపెల్లి మురళీధర్, నాయకులు ప్రేమ్‌కుమార్, దేవేందర్, కృష్ణ మూర్తి, బీబీ చారి, గడ్డం కుమార్‌రెడ్డి, లట్ట రాజ బాబు, కవ్వంపెల్లి శేఖర్, బుర్ర రాజు, శ్రీకాంత్ పటేల్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఎంపీగా కవిత గెలవడం ఖాయం

- ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

వెంకటాపూర్, మే 6 : ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ గెలిచిందని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లడుతూ మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎలా ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నారని, కాంగ్రెస్ మీద ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. తమ పార్టీ ఎంపీటీసీలు, ఎంపీపీలు, ఇతర నాయకులను భయభ్రాంతులకు గురిచేసి, ప్రలోభ పెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని, కానీ వారితో పాటు కుటుంబ సభ్యుల ఓట్లు కూడా బీఆర్ఎస్‌కే పడనున్నాయన్నారు. ఇచ్చిన హామీలు నేరవేర్చడంలో క్రాంగ్రెస్ విఫలమైన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మహబూబాబాద్ ఎంపీగా కవిత గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. భారీ మెజార్టీతో మరోసారి కవిత గెలువడం ఖాయమన్నారు. సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, మండలాధ్యక్షులు లింగాల రమణారెడ్డి, జడ్పీటీసీ గై రుద్రమదేవీ అశోక్, ఎంపీటీసీ పోశాల అనితా వీరమల్లు, మాజీ సర్పంచ్‌లు మెడబోయిన అశోక్, బొజ్జ జగన్‌మోహన్‌రావు, కో ఆప్షన్ మెంబర్ జహీర్‌పాషా, సీనియర్ నాయకులు పోరిక హర్జినాయక్, బాషబోయిన పోశాలు యాదవ్, చంటి భద్రయ్య, ఆశాడపు దేవేందర్, జనగాం రవీందర్, అంతటి రాము, దగ్గు ప్రభాకర్, మహేందర్, రాజేందర్, మధుయాదవ్, మెట్టు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

గారెపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రశాంత్

కాటారం, మే 6 : మండలంలోని గారెపల్లి (కే) పీఏసీఎస్ చైర్మన్‌గా తోటపల్లి ప్రశాంత్ ఎన్నికయ్యారు. స్థానిక సంఘం కార్యాలయంలో డీసీవో శైలజ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో 10 మంది డైరెక్టర్లు పాల్గొన్నారు. చైర్మన్‌గా గంగారానికి చెంది న ప్రశాంత్, వైస్ చైర్మన్‌గా ఇబ్రహీంపల్లికి చెందిన దబ్బెట స్వామి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీవో ప్రకటించారు. అనంతరం చైర్మన్‌కు ధ్రువీకరణ పత్రం అందజేశారు. గతంలో చైర్మన్‌గా ఉన్న చల్లా నారాయణరెడ్డిపై సంఘం సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో నూతన చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. కాగా, చైర్మన్ ప్రశాంత్‌ను వైస్ చైర్మన్ దబ్బెట స్వామి, డైరెక్టర్లు వీ ప్రభాకర్‌రెడ్డి, చీమల సత్యం, జక్కుల అజయ్, రాజబాబు, రాజేశ్వరి, కృష్ణవేణి, హిమాకర్, చంద్రు రాజయ్య, సీఈవో సతీశ్, సిబ్బంది శాలువాలతో సన్మానించారు.

రెండో రోజు పోలైన 511 ఓట్లు

భూపాలపల్లి రూరల్, మే 6 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో రెండో రోజైన సోమవారం 511 మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కోసం 2,245 మంది ఉద్యోగులు నమోదు చేసుకున్నారని, రెండు రోజుల్లో 934 మంది ఓటు వేశారని తెలిపారు. అలాగే జిల్లాలో 85 సంవత్సరాలు పైబడిన 54 మంది, దివ్యాంగులు 24 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 76 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని, మిగిలిన ఇద్దరిలో ఒకరు మరణించగా, మరొకరు ఓటు హక్కు వినియోగించుకోలేదని పేర్కొన్నారు.

500 బోనాలతో బీరన్నకు నైవేద్యం

ములుగు రూరల్, మే 6 : ములుగు జిల్లా కేంద్రంలో జరుగుతున్న బీరన్న పండుగలో భాగంగా సోమవారం యాదవులు 500 బోనాలతో నైవేద్యాన్ని సమర్పించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనంతో డప్పు చప్పుళ్ల నడుమ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గోపు చంద్రమల్లు, గొర్రె అంకూస్, బైకాని చిన్న కొమురయ్య, బైకాని బైకులు, ఇమ్మడి రమేశ్, కొనుపుల కుమార్, బైకాని సాగర్, గుండెబోయిన కుమార్, బైకాని నటరాజ్, బండారి కుమార్, జక్కుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకోవాలి

ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు ■ ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, మే 6 : బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. బాధితులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సీఐలు, ఎస్సైలు పరిశీలించి చట్టపరంగా పరిష్కరించాలన్నారు. బాధితులకు పీఎస్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా దివస్‌లో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి : డీఎంహెచ్‌వో

తాడ్వాయి, మే 6 : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా జాగ్రత్తలపై ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ములుగు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీవో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వైద్య సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకొని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు సేవ చేయాలన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రణధీర్, ప్రోగ్రాం ఆఫీసర్ పవన్‌కుమార్, డీపీఎంవో సంధ్యారావు, సీహెచ్‌వో శకుంతల, పల్లె దవాఖాన వైద్యాధికారులు స్వాతి, శ్యామ్, హెచ్ఈవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరం పరిశీలన

గణపురం, మే 6 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా శిక్షణ శిబిరాన్ని సోమవారం భూపాలపల్లి జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పలు మండలాలల్లో క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువకులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని కోచ్ మాడిశెట్టి రవీందర్‌కు సూచించారు. ఈ సందర్భంగా సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు విడిదినేని అశోక్ ఐదు బ్యాట్లు, వీ సాంబయ్య ఆరు బాల్స్‌ను శిబిరానికి హాజరవుతున్న క్రీడాకారులకు అందజేశారు.

ధూప, దీప ఆలయాల అర్చకుల సమావేశం

వెంకటాపూర్, మే 6 : మండలంలోని రామప్ప దేవాలయంలో ధూప, దీప ఆలయాల అర్చకులతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు డివిజనల్ ఇన్‌స్పెక్టర్ డీ అనిల్ కుమార్, ఈవో బిల్లా శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ రిజిస్ట్రేషన్ అప్‌డేట్, పబ్లికేషన్ చేయించాలని, దేవాలయాల పేరిట భూమి ఉంటే బ్యాంక్ ఖాతాలు తెరిచి, వాటి వివరాలను దేవాదాయ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో అర్చకులు హరిశేశర్మ, ఉమాశంకర్, సిబ్బంది అవినాశ్‌రెడ్డి, మార్క సంతోష్, గుడిమల్ల సంతోష్, దామోదర్, పైండ్ల రత్నకుమారి, వెంకటాపూర్, ములుగు, గోవిందరావుపేట, మల్లంపల్లి, గణపురం మండలాలకు చెందిన ధూప, దీప ఆలయాల అర్చకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను ఓట్లు అభ్యర్థిస్తున్న జడ్పీటీసీ గొర్రె సాగర్

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మొద్దు

చిట్యాల, మే 6 : కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని జడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరెపల్లి మల్లయ్య, నాయకులతో కలిసి మండలంలోని తిరుమలాపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలుసుకొని బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు కర్రె అశోక్‌రెడ్డి, అల్లం రవీందర్, పిట్ట సురేశ్, శంషుద్దీన్, చేరాల సదానందం, ఏరుకొండ రఘు, పోశాల రాజు, కూస ప్రశాంత్, గుండు నగేశ్, నల్ల నవీన్ ఉన్నారు.

అధికారం కోసమే బోగస్ హామీలు..

అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ బోగస్ హామీలిచ్చిందని బీఆర్ఎస్ మొగుళ్లపల్లి మండలాధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని రంగాపురంలో ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కత్తి రాజుగౌడ్, ఉపాధ్యక్షుడు చిలువేరు సుమన్, ప్రధాన కార్యదర్శి తక్కలపల్లి రాజు, యూత్ అధ్యక్షుడు మ్యాదరి నరేశ్, సీనియర్ నాయకులు ఏ బాపురావు, సూరినేని భాస్కర్‌రావు, ఇంజపెల్లి రాజయ్య, రాజేశ్వర్‌రావు, ఎం దానయ్య, కత్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో, అదనపు కలెక్టర్

పారపాట్లు లేకుండా కమిషనింగ్‌ను పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్, మే 6 : ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తూ ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ములుగు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఈవీఎం గోదాంలో జరుగుతున్న మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ములుగు అసెంబ్లీ సెగ్మెంట్ ఈవీఎం, వీవీ ప్యాట్, సీయూసీ కమిషనింగ్‌ను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనున్న దృష్ట్యా ఈవీఎం గోదాంలో ములుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన 768 బ్యాలెట్ యూనిట్స్, 384 కంట్రోల్ యూనిట్స్, 430 వీవీ ప్యాట్లను 25 టేబుల్స్ ద్వారా ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు కమిషనింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్లు విజయ్‌భాస్కర్, రవీందర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.

సంతకాల సేకరణ

స్వీప్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం ఓటరు అవగాహన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్ నిర్వహించారు. కలెక్టర్ ఫెక్సీపై మొదటి సంతకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఆర్వో రఫీక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్, మే 6 : ములుగు మండలం దేవగిరిపట్నంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి ముస్లిం విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ములుగు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి ప్రేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం 9100530620, 9989661146 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న గీతాబాయి

కొప్పులను భారీ మెజార్టీతో గెలిపించాలి

బీఆర్ఎస్ మంథని నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు గీతాబాయి

మహదేవపూర్, మే 6 : బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మంథని నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి కోరారు. సోమవారం మండలంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న పని ప్రదేశాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీల మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను నమ్మించి గెలిచిన తర్వాత వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం కోసం ఏపీవోకు వినతులు

ఏటూరునాగారం, మే 6 : స్థానిక ఐటీడీఏలో సోమవారం గిరిజనులు తమ వినతులను ఏపీవో వసంతరావుకు అందచేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని, ఈఎస్ఎస్ పథకం కింద రుణాలు అందించాలని విన్నవించారు. వెంకటాపురం మండలానికి చెందిన సుజాత తన మూడేళ్ల పాప ఇనుప స్టాండు మీదపడడంతో గాయపడి వైద్యశాలలో ఉందని, తమకు ఆర్థిక సాయం అందించాలని వినతి పత్రం అందించారు. తక్షణమే చర్యలు తీసుకునేలా పీవో దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ దామోదర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మల్హర్, మే 6 : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రుద్రారంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రుద్రారం ఊర చెరువు అభివృద్ధి, పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముంజపల్లి పరిధిలోని మారెడుపల్లికి చెందిన దోనిపల్లి హరికృష్ణ (27) చెరువు కట్టపై నీళ్లు కొట్టడానికి సమీపంలోని బోర్ నుంచి ట్రాక్టర్లో నీళ్లు నింపి క్యాప్ పెడుతున్న క్రమంలో పైన ఉన్న విద్యుత్ వైరు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ తెలిపారు. కాగా, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఉద్యోగానికి వెళ్లాలన్నందుకు..

వెంకటాపురం (నూగూరు) మే 6 : మండలంలోని పాత్రాపురంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మధుసూదన్‌రావు (35) మణుగూరు సింగరేణిలో ఆటోమోబైల్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. మద్య